# ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను జలమండలి ఎండీ ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్, మే 23 ప్రభాతవార్త

జలమండలి అశోక్ రెడ్డి శనివారం తట్టిఖానా, జూబ్లీహిల్స్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కమాండ్ ప్రాంతాల్లో ట్యాంకర్ల సరఫరా విధానాన్ని పరిశీలించిన ఆయన, ట్యాంకర్ల డెలివరీ ప్రక్రియపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంకర్ల పంపిణీ సమయపాలన, వినియోగదారులకు అందుతున్న సేవల తీరు, ఫిల్లింగ్ స్టేషన్ కార్యకలాపాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అలాగే ట్యాంకర్ల సరఫరా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నదా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. షెడ్యూల్ ప్రకారం ట్యాంకర్ల సరఫరా తప్పనిసరిగా జరగాలని ఎండీ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ట్యాంకర్ల డెలివరీ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న వారం రోజుల పాటు మూడు షిఫ్టుల్లో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఎండీ ఆదేశించారు. వర్షాలు ప్రారంభమయ్యే వరకు ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అవసరం మేరకే నీటిని వాడాలని, వృథా తగ్గించాలని సూచించారు.



ఫిల్లింగ్ స్టేషన్లలో ట్యాంకర్ల సరఫరాపై అధికారుల నుండి వివరాలు సేకరిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ వార్త



# విజి'లెన్స్'ఉందా?

**-ఎసిబికి చిక్కేవరకు వారికి తెలియదా..?**
**-జిహెచ్‌ఎంసి, జలమండలి, హెచ్‌ఎండిఎలలో అనినీతి**
**- వరుసగా బయటపడుతున్న అధికారులు భాగోతం**
**-అక్కడ విజిలెన్స్ విభాగం ఉన్నా ..అవినీతిని గుర్తించడంలో విఫలం**
**-ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అదేశిస్తేనే ఎంక్వైరీ... లేకుంటే సైలెంట్**
**-గ్రేటర్ నిఘా విభాగాలపై సర్వత్రా విమర్శలు**







హైదరాబాద్,మే 23,ప్రభాతవార్త:

గ్రేటర్ హైదరాబాద్ లోని కీలక ప్రభుత్వ సంస్థల్లో విజిలెన్స్ విభాగాల పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జీహెచ్ ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ లాంటి శాఖల్లో అధికారుల అవినీతి, అక్రమాలపై నిఘా పెట్టాల్సిన విజిలెన్స్ విభాగాలు పూర్తిగా విఫలమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి అధికారులపై ముందస్తు సమాచారం సేకరించి ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వాల్సిన విజిలెన్స్ అధికారులు మాత్రం కేవలం పేరుకే పనిచేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఏసీబీ దాడుల్లో వరుసగా అధికారులు పట్టుబడుతున్న పరిస్థితి నెలకొంది. బల్దియా, జలమండలి, హెచ్ఎండీఏ వంటి కీలక ప్రభుత్వ శాఖల్లో విజిలెన్స్ విభాగాలు ఉన్నప్పటికీ.. అవినీతి అధికారులపై సమర్థవంతమైన నిఘా లేకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ శాఖల్లో ఎవరెవరు లంచాలు తీసుకుంటున్నారు..? టెండర్లలో ఎక్కడ అవకతవకలు జరుగుతున్నాయి..? కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు తీసుకుని పనులు కట్టబెడుతున్న అధికారులు ఎవరు..? వంటి అంశాలపై నిరంతరం నిఘా పెట్టి ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాల్సిన విజిలెన్స్ విభాగం.. ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్యమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జీహెచ్ ఎంసీలో సుమారు ఇరవై ఐదు మందికి పైగా సిబ్బందితో విజిలెన్స్ విభాగం కొనసాగుతోంది. ఒక డీఎస్పీ, ఇద్దరు ఇన్స్పెక్టర్లు, పలువురు ఎస్సైలు, ఇతర సిబ్బంది ఉన్నప్పటికీ.. అవినీతి అధికారులపై అంతర్గత నిఘా మాత్రం కనిపించడం లేదంటున్నారు.

**వాళ్లు చెప్తేనే..**

ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఎంక్వైరీ ఆదేశిస్తే తప్ప.. స్వయంగా అవినీతి కేసులు గుర్తించి చర్యలు తీసుకునే పరిస్థితి లేదని విమర్శలు వస్తున్నాయి. దీంతో అధికారుల్లో భయం లేకుండా పోయిందని.. కొందరు బహిరంగంగానే లంచాల వ్యవహారాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో జీహెచ్ ఎంసీ, వాటర్ బోర్డు, హెచ్ఎండీఏ శాఖలకు చెందిన పలువురు అధికారులు ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం విజిలెన్స్ వ్యవస్థ వైఫల్యాన్ని బట్టబయలు చేస్తున్నదని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. సాధారణ ప్రజలే అవినీతి అధికారులపై ఆధారాలు సేకరించి ఏసీబీకి ఫిర్యాదులు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శాఖలోనే ఉన్న విజిలెన్స్ అధికారులు ముందుగానే సమాచారాన్ని గుర్తించి చర్యలు తీసుకుని ఉంటే.. ఈ స్థాయిలో అవినీతి పెరగేదా అన్న చర్చ జరుగుతోంది. జలమండలిలో అయితే విజిలెన్స్ విభాగం అసలు విధులు పక్కన పెట్టి ఇతరత్రా పనుల్లో నిమగ్నమైందన్న విమర్శలు మరింత తీవ్రంగా వినిపిస్తున్నాయి. అక్రమ కనెక్షన్లు, నల్లాలకు మోటార్లు అమర్చిన వారి వద్ద తనిఖీలు చేయడం, చిన్నచిన్న ఫీల్డ్ పనులకే పరిమితమవుతూ.. శాఖలోని అవినీతి అధికారులపై నిఘా పూర్తిగా విస్మరించిందన్న ఆరోపణలు ఉన్నాయి. టెండర్లలో జరుగుతున్న అక్రమాలు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై జరిగే వ్యవహారాలు, బిల్లుల క్లియరెన్స్‌లలో లంచాల వ్యవహారాలపై విజిలెన్స్ ఎలాంటి ప్రత్యేక నివేదికలు ప్రభుత్వానికి ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. హెచ్ఎండీఏ, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లలో కూడా విజిలెన్స్ విభాగాల పనితీరు అంతంత మాత్రంగానే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శాఖల్లో జరుగుతున్న అవినీతి, అధికారుల నిర్లక్ష్యం, టౌన్ ప్లానింగ్ అక్రమాలు, అనుమతుల మంజూరులో అవకతవకలు, భూవ్యవహారాల్లో జరుగుతున్న అనుమానాస్పద లావాదేవీలపై ఎలాంటి సమగ్ర నివేదికలు బయటకు రావడం లేదంటున్నారు. దీంతో విజిలెన్స్ విభాగం ఉండి ఉపయోగమేంటి..? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అవినీతి నియంత్రణలో విజిలెన్స్ విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని తెలుస్తోంది..అవినీతి అధికారులపై ముందస్తు నిఘా పెట్టాల్సిన విజిలెన్స్ వ్యవస్థ నిర్వీర్యమవుతుండగా.. ఏసీబీ దాడుల్లో వరుసగా బయటపడుతున్న అక్రమాలు ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

# బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**-ముస్లిం, గోరక్షక్ సభ్యులతో విడివిడిగా సమన్వయ సమావేశాలు**
**-సమస్యాత్మక ప్రాంతాల్లో సిసి కెమేరాలతో నిరంతర నిఘా : సిపి సుమతి**





నేరెడ్ మెట్,మల్కాజ్‌గిరి కమిషనరేట్ , మే 23,ప్రభాతవార్త :

బక్రీద్ పండుగను పరస్పర సహకారంతో ప్రశాంత వాతా వరణంలో జరుపుకోవాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషన ర్ బి. సుమతి ఐపీఎస్ ప్రజ లకు పిలుపునిచ్చారు. పండు గ సందర్భంగా ఎలాంటి అ వాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శనివారం నేరేడ్‌మెట్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, గోరక్షక్ సభ్యులతో విడివిడిగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.ఈ సంద ర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బక్రీద్ వంటి ముఖ్యమైన పండుగలను సామరస్య వాతావరణంలో జరుపుకోవడం సమాజ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. పండుగ రోజుల్లో వదంతులు, అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపించే తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని కోరారు.అనుమానాస్పద వాహనాలు, అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు.గోవులను తరలించే వాహనాలను అడ్డుకోవడం, వ్యక్తులపై దాడులకు పాల్పడడం, బలవంతపు తనిఖీలు నిర్వ హించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని గోరక్షక్ సభ్యులకు సూచించారు. అనుమానాస్పద ఘటనలు గమనిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ప్రభుత్వం అనుమ తించిన ప్రదేశాల్లోనే జంతువధ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో జంతు అవశేషాలు వేయకుండా పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ అధికారులతో కలిసి సూచించారు. పండుగ సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో ఎల్బీనగర్ డీసీపీ అనురాధ ఐపీఎస్, మల్కాజ్‌గిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్, ఉప్పల్ డీసీపీ సురేష్, ప్రత్యేక విభాగం డీసీపీ జి. నరసింహారెడ్డి, మహిళా భద్రత డీసీపీ ఉషారాణి, పరిపాలన విభాగం డీసీపీ ఇందిరా, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ప్రధాన కార్యాలయ డీసీపీ శ్యాంసుందర్, అదనపు డీసీపీలు తదితరులు పాల్గొన్నారు.

# జూపార్కులోని జంతువుల ఎన్‌క్లోజర్ల వద్ద ఎయిర్‌కూలర్లు



ఏనుగులకు నీరు చల్లుతున్న జూ పార్కు ఉద్యోగి



చల్లదనం కోసం పాగాస్ వద్ద నిలబడిన పులి



జూ పార్కులోని ఖడ్గ మృగాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

చార్మినార్,మే 23 ప్రభాతవార్త :

ఎండలు తీవ్రంగా ఉండటంతో జూపార్కులోని జంతువుల సంరక్షణ కోసం జూ అధికారులు ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లు చేశారు. రోజు ,రోజుకు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి పోతున్నాయి.ఎండతో పాటు ఉక్కపోత కూడ ఎక్కువగా ఉంది.ఎండ వేడిమి నుంచి జంతువులు ఉపశమనం పొందటానికి జూ పార్కు అధికారులు ఎన్‌క్లోజర్లు వద్ద ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. జూ పార్కులోని దుప్పులు, కోతులు, జింకలు, సింహాలు కోసం చల్లగా ఉండటానికి క్రర్రలు, తాటాకులతో పందిర్లను ఏర్పాటు చేశారు.జూ పార్కులో 22 పులులు,22 సింహాలు,4 ఏనుగులతో పాటు 150 ఎన్‌క్లోజర్లలో దాదాపు రెండు వేల రెండు వందల జంతువులు,పక్షులు ఉన్నాయి.అన్ని ఎన్‌క్లోజర్లలో జంతువులు కోసం మంచి నీరు ఉంచారు.జూపార్కులోని ఏనుగులకు జూ పార్కు సిబ్బంది ఏనుగులకు పైపులతో నీరును చల్లుతున్నారు.జూ పార్కులోని సింహాలు, పులుల తో పాటు ఇతర జంతువులకు మల్టీ విటామిన్ టా బ్లెట్లను నీళ్ల కలిపి అందిస్తున్నారు.కాగా వేసవి కాలం సందర్భంగా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది పర్యాటకులు తిలకించటానికి వస్తున్నారు.ప్రతీ సోమవారం జూపార్కుకు సెలవు.

# అనుమతి లేని హోర్డింగులపై కఠిన చర్యలు

**-రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు**
**-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**

హైదరాబాద్, మే 23 ప్రభాతవార్త : అనుమతి లేకుండా హోర్డింగులు ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. శనివారం బోడుప్పల్ పరిధిలోని కేశవ్‌నగర్, హనుమాన్‌నగర్ కాలనీ, బృందావన్ కాలనీ, వెస్ట్ హనుమాన్ నగర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించారు. మొదట కమిషనర్ హనుమాన్ నగర్ కాలనీలో వాణిజ్య సంస్థలను తనిఖీ చేసి, ట్రేడ్ లైసెన్సులు లేని దుకాణాలపై ఆరా తీశారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం అన్ని వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు పొందాలని, వాటిని ప్రజలకు కనిపించే విధంగా దుకాణాల ముందు ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. అలాగే కేశవ్‌నగర్, రోడ్ నెం.3,బృందావన్ కాలనీలో పలు ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు మరియు చెత్తను అక్రమంగా పారవేయడాన్ని కమిషనర్ గమనించారు. సంబంధిత ప్లాట్ యజమానులను సంప్రదించి వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ డంపింగ్ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతే కాకుండా బోడుప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్క్,జిమ్ పరికరాలను కమిషనర్ పరిశీలించారు. పనిచేయని పరికరాలను మరమ్మతు చేయాలని, అవసరమైతే కొత్త పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని హనుమాన్‌నగర్ కాలనీలో చేపడుతున్న జనగణన కార్యక్రమాన్ని కమిషనర్ సమీక్షించారు. సూపర్వైజర్లు,ఎన్యుమరేటర్లతో మాట్లాడి పనుల పురోగతి, హాజరు,ఫీల్డ్ స్థాయి వివరాలను తెలుసుకున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండటం లేదా నివాసితులు అందుబాటులో లేకపోయిన సందర్భాల్లో సరైన ఫాలోఅప్ నిర్వహించి ఒక్క ఇంటిని కూడా మిస్ కాకుండా ఖచ్చితమైన డేటా సేకరణ చేపట్టాలని సూచించారు. వీటితో పాటు వెస్ట్ హనుమాన్‌నగర్ మరియు బృందావన్ కాలనీలో అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు, ప్రజా గోడలపై ఏర్పాటు చేసిన అక్రమ హోర్డింగ్స్,ప్రకటన బోర్డులను వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజా ప్రదేశాల దుర్వినియోగాన్ని అరికట్టి పరిశుభ్రతను కాపాడాలని స్పష్టం చేశారు. అలాగే అర్బన్ పార్క్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, మొక్కలు నాటడం, మౌలిక సదుపాయాల కల్పన, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, హరిత కార్యక్రమాలు,పర్యావరణ అవగాహనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. అలాగే అర్బన్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీసీ శైలజ, మెయింటెనెన్స్ ఈఈ రమేష్ బాబు, డీఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, సెన్సస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

# బోర్డు మాయంపై తహసీల్దార్ సీరియస్

**-గాలికి పోయిదంటూ జిపివో హైడ్రామా..**

**(వార్త ప్రభావం)**

దుండిగల్, మే 23 ప్రభాతవార్త:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ దుండిగల్ మండలం, దొమ్మర పోచంపల్లి పరిధి సర్వేనంబర్ 120/11లోని ప్రభుత్వ స్థలంలో రెవిన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగించిన నేపథ్యంలో 'ప్రభుత్వ స్థలంలో బోర్డు మాయం' అనే శీర్షికతో ప్రభాతవా ర్తలో ప్రచురించిన కథనానికి తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి స్పందించారు. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు తొలగించి మూడు రోజులు గడుస్తున్న ఏంచేస్తున్నారంటూ సిబ్బందిపై మండిపడ్డారు. ఈవిషయమై పూర్తి నివేదిక అందజేయడంతో పాటు వెంటనే మరో బోర్డు ఏర్పాటు చేయాలని జిపివో సందీప్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సదరు ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన జిపివో తనదైనశైలిలో నివేదిక అందజే సినట్లు సమాచారం.





ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవిన్యూ సిబ్బంది

**హెచ్చరిక బోర్డు గాలికి పోయిందంట...జిపివో హైడ్రామా..?**

ప్రభుత్వ స్థలంలో బోర్డు తొలగింపుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో రెవిన్యూ సిబ్బంది చెబుతున్న సమాధానాలు విస్తుపోయేలా ఉన్నాయి. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు గాలికి పోయిందంటూ జిపివో సందీప్ పేర్కొనడం ఆశ్చర్యానికి, అనుమానానికి గురి చేస్తోంది. 20కిలోలకు పైగా బరువున్న ఇనుము బోర్డు గాలికి పోవడం సాధ్యమేనా..? పడిపోయిన బోర్డు అక్కడే లేకపోవడం, కబ్జాకు యత్నిస్తున్న ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణంలో ఓ పక్కన ఉండదం..? మళ్ళీ అదే బోర్డు ఏర్పాటు చేసి పై అధికారులను తప్పుదోవ పట్టించడం చూస్తుంటే ప్రభుత్వ స్థలాన్ని కొల్లగొట్టేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్న అక్రమార్కులకు కొందరూ సిబ్బంది పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. కాగా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసే బోర్డులు గాలికి పోవడం ఏంటని పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం జిపివో సందీప్‌ను అడుగగా బోర్డులు ఉంటాయి..పోతాయి మీకేందుకు అంటూ నిర్లక్ష్య వైఖరితో సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

# తాగునీటి సమస్యను పరిష్కరించాలని బిఆర్‌ఎస్ ధర్నా



హైదరాబాద్, మే 23 ,ప్రభాతవార్త

జంటనగరాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని జల మండలి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నగర ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నీళ్లు రావడం లేదని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నీటి సరఫరాను మెరుగుపర్చకపోతే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రజల బతుకులు బాగుపడతాయన్న ఆశతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారని తెలిపారు. కేవలం నీటి సమస్యనే పరిష్కరించకపోతే పరిపాలన ఎలా చేస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథను స్ఫూర్తిగా తీసుకుని నగరంలో నీటి సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.పాలకులకు, అధికారులకు అనుభవరాహిత్యంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్‌కు ప్రజాప్రతినిధులు ఎవరూ లేకపోవడంతో బీఆర్ఎస్ ప్రతినిధులున్న ప్రాంతాలవైపు చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. రోజుకు 750 ఎంజీడీల నీటి అవసరం ఉండగా కేవలం 550 ఎంజీడీలే సరఫరా చేస్తున్నారని తెలిపారు. మరోవైపు రోజుకు 12 వేల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతుండడం చూస్తే పైప్‌లైన్ ద్వారా సరైన నీటి సరఫరా జరగడం లేదనే విషయం స్పష్టమవుతోందని అన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భాష ఏదైనా.. ఫిర్యాదు సులభం

**-'ఏఐ కాప్‌రైటర్'ను ఆవిష్కరించిన సిటీ పోలీస్**
**-దేశంలోనే మొదటిసారి 10కిపైగా భాషల్లో ఫిర్యాదుల నమోదు**
**-యాప్‌ను ఆవిష్కరించిన సిపి సజ్జనార్**

హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:

పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భాషా పరమైన ఇబ్బందులు కలగకుండా, వారి ఫిర్యాదులను త్వరితగతిన, కచ్చితత్వంతో నమోదు చేసేందుకు దేశంలోనే తొలిసారిగా ఏఐ కాప్‌రైటర్ అనే కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీలో శనివారం ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనర్ ఆవిష్కరించి దాని పనితీరును పరిశీలించారు. నగరంలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, బాధితులు తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను పోలీసులు తక్షణమే రికార్డు చేసి, అనువదించు కోవచ్చు. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో తెలుగు, ఇంగ్లీష్ రాని ఇతర రాష్ట్రాల వలస కార్మి కులు, పర్యాటకులు ఫిర్యాదు చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భాష అర్థం కాక ఎఫ్.ఐ.ఆర్ నమోదులో జాప్యం జరగడం, సమాచారం తప్పుగా నమోదవ్వడం వంటి సమస్యలకు ఈ యాప్ స్వస్తి పలకనుంది.

**పదికిపైగా భాషల గుర్తింపు..**

10కి పైగా ప్రధాన భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యం ఈ యాప్ సొంతం. ఈ వినూత్న యాప్ ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సంస్థతో పాటు ఇంటర్న్ పాగ్రో చందు సహకారంతో హైదరాబాద్ సిటీ పోలీస్ రూపొందించింది. హిందీ, తమిళం,బెంగాలీ, మరాఠీ వంటి 10 భాషల్లో మాట్లాడితే, అది వెంటనే రాతపూర్వక రూపంలోకి మారి, పోలీసులకు అర్థమయ్యే భాషలోకి అనువదించబడుతుంది. గంటల తరబడి పట్టే ఫిర్యాదు ప్రక్రియను కేవలం సెకన్లలోనే పూర్తి చేయవచ్చు. అనువాదకుల కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ఫిర్యాదు రికార్డ్ చేసిన అధికారి వివరాలు, సమయం వంటివి ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో నిక్షిప్తమవుతాయి. దీనివల్ల రికార్డులను తారుమారు చేసే అవకాశం ఉండదు... అలాగే బాధితుడు, నిందితుడు లేదా సాక్షులు మాట్లాడే మాటలను వేర్వేరుగా గుర్తించి రికార్డ్ చేస్తుంది.పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా ఈ ఏఐ ఆధారిత మల్టీలింగ్వల్ కంప్లైంట్ రికార్డర్‌ను అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణమని సిపి సజ్జనర్ అన్నారు. "హైదరాబాద్ ఒక గ్లోబల్ సిటీ కావడంతో ఇక్కడ తెలుగు, ఇంగ్లీష్ రాని వలసవచ్చిన ఇతర రాష్ట్రాల వారు, విదేశీయులు ఎందరో ఉంటారు. భాష తెలియకపోవడం వల్ల ఫిర్యాదు చేయడంలో జాప్యం జరగడం లేదా సమాచారం తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలకు ఈ యాప్ చెక్ పెట్టనుంది. బాధితుడు తన మాతృభాషలో మాట్లాడితే, ఈ యాప్ దానిని వెంటనే గుర్తించి, అనువదించి, అధికారిక రికార్డుగా మారుస్తుంది. మాట్లాడిన ప్రతి 5 సెకన్లకు సమాచారం అప్‌డేట్ అవుతుంది. ఈ సాంకేతికత వల్ల ముఖ్యంగా వలస కార్మికులు, మహిళలు, వృద్ధులకు పోలీసు సేవలపై భరోసా పెరుగుతుంది. బాధితులు చెప్పే ప్రతి మాటను యథాతథంగా నమోదు చేయడం వల్ల దర్యాప్తులో నాణ్యత పెరిగి, తద్వారా నిందితులకు శిక్ష పడే అవకాశాలు మెరుగుపడతాయి. దీనివల్ల పోలీసు అధికారులకు టైపింగ్ భారం తగ్గడమే కాకుండా, రికార్డుల నిర్వహణ పద్ధతి ఏకరీతిగా ఉంటుంది." అని ఆయన అన్నారు. ఈ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు సిపిలు ఎం.శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, డీసీపీ (ఎస్ఎమ్ఐటీ) సీహెచ్ రూపేష్, టీ సెల్ ఇన్స్పెక్టర్ రమేశ్, బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న సిటీ పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనార్ తదితరులు

## మద్యం తాగి డ్రైవింగ్ చేయకండి : ట్రాఫిక్ ఏసిపి శంకరరాజు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు.

**బేగంపేట, మే23, ప్రభాతవార్త**

మద్యం తాగి వాహనాలు నడపకండి.ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.ప్రాణాలు సురక్షితంగా ఉంచుకోండి అంటూ తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు పిలుపు నిచ్చారు.బేగంపేట అశోక్ మై హోం ఛాంబర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై శనివారం ట్రాఫిక్ అధికారులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో (సత్యం వెంచర్ ఇంజనీరింగ్ సర్వీసెస్) ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమం మల్కాజ్ గిరి పోలీస్ కమీషర్ బి.సుమతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ 1 డిసీపీ కె.రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని,అలాగే కార్లలో సీటు బెల్టుధరించి ప్రయాణించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పకుండా పాటించాలన్నారు.మొబైల్ ఫోన్ల వాడకం వల్ల వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుందని అలా చేయవద్దని ఏసీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో హీరో కార్ప్‌మేనేజర్ సాదిక్ సాగర్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, మే 23 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలను పరిష్కరించిన ఘనత తమదేనని, ప్రజలు నిరంతరం తమకు బ్రహ్మరధం పడుతున్నారని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫలమండీ డివిజన్‌లో పద్మారావు గౌడ్ శనివారం విస్తృతంగా పర్యటించి రూ. కోటి 25 లక్షల రూపాయల ఖర్చుతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. చిలకలగూడా, వెంకటేశ్వర నగర్, ఉప్పరిబస్తి, బ్రాహ్మణబస్తీ ప్రాంతాల్లో సీసీ రోడ్డు, సివరేజీ లైన్‌ల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం నిరంతరం సాగే ప్రక్రియగా మార్చుకున్నామని, ప్రజల సమస్యలకు వెనువెంటనే స్పందిస్తామని తెలిపారు. ప్రజలు తమ అవసరాలకు సీతాఫలమండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నేత రామేశ్వర గౌడ్, మాజీ కార్పొరేటర్ సామాలహేమ, వివిధ విభాగాల అధికారులు వేణు, కుశాల్, నాయకులు పాల్గొన్నారు.

## పేద రోగుల సహాయకులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ముజీబ్

**బేగంబజార్,మే 23 ప్రభాతవార్త:**

అసద్,అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆద్వర్యంలో వైద్యం కోసం పేద రోగులకు ఉచితంగా అన్నదానం చేశారు.ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 400 మంది పేదరోగులకు ట్రస్ట్ చైర్మన్ ,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆద్వర్యంలో అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల నుంచి పేద రోగులకు ప్రతినెల మూడు వారాలపాటు అన్నదానం చేయడం,ముఖ్యంగా ముజీబ్ తల్లిదండ్రుల పేరిట అన్నదానం చేయడం పట్ల సంతోషదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ,కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, ఖాలేద్‌అహ్మద్, శంకర్, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రియూనిట్ శివకుమార్,కార్యదర్శి చంద్రశేఖర్,మహ్మద్ వహీద్,మహ్మద్ ముస్తాఫా పాల్గొన్నారు.

## దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బిజెపి నాయకులు

**గన్‌ఫౌండ్రి,మే23ప్రభాతవార్త:** బాటసార్లకు చలివేంద్రాల ద్వారా దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో దోహదంచేస్తాయని తెలంగాణ రాష్ట్రబిజెపి ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయం ముందు చలివేంద్రాన్ని బిజెపి కార్యాలయ ఇన్‌చార్జ్ ఉమాశంకర్,డి.గోపాల్‌జీ,అలే బాస్కర్‌లతో కలసి ఆయనప్రారంభించారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాల ద్వారా బాట సార్లకే కాకుండా బిజెపి కార్యాలయానికి పనినిమిత్తం వచ్చే బిజెపినాయకులు,కార్యకర్తలకు దాహార్తిని తీర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్ర మంలో బిజెపి నాయకులు వెంకటేష్,సంజయ్‌గనాటే,ప్రయాసాని పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ సిఈఒను కలిసిన ఎంప్లాయిస్ యూనియన్ నేతలు



ఆరోగ్యశ్రీ సీఈఒ హనుమంత్ కొండిబాను కలిసిన గిరి యాదయ్య

**చిక్కడపల్లి మే 23 ( ప్రభాతవార్త ) :** రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ నూతన సీఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జెడ్. హనుమంత్ కొండిబా ని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య నేతృత్వంలో ఈ సందర్భంగా సీఈఒ హనుమంత్ కొండిబా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం కోసం వచ్చే పేషెంట్లు పలు సమస్యలతో మొదటగా ఆరోగ్య మిత్ర ల దగ్గరకే వస్తారని గుర్తుచేశారు. కాబట్టి క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా పూర్తిగా ఉచిత వైద్యం అందేలా ఉద్యోగుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని సూచించారు. ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతగా పనిచేసి పథకం విజయవంతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ఉపాధ్యక్షులు సుమన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రత్నం, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఎయిర్ లైన్స్‌కాలనీ బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి : ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట మే 23,ప్రభాతవార్త**

బేగంపేట ఇండియన్ ఎయిర్ లైన్స్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శనివారం ఎయిర్ లైన్స్‌కాలనీలో మాజీ కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరితో కల్సి ఎమ్మెల్యే పర్యటించారు.స్థానికులను అడిగి సమస్యలు తెల్సుకున్నారు.డ్రేనేజీ సమస్య,గార్డెన్ నిర్వహణ సక్రమంగా లేదని,కాలనీలో పలు చోట్ల వీధిలైట్లు వెలగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత సమస్యలపై వెంటనే స్పందించాలంటూ అధికారులను ఆదేశించారు .కమిటీ హాల్ ను విస్తరించాలని కోరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా స్థనిక పార్క్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌లైన్ కాలనీ ఏర్పడిన 40సంవత్సరాలలో గతంలో ఏ ప్రభుత్వంలో కానీ,తప కంటే ముందు ఉన్న ఎమ్మెల్యేల హయాంలో జరగని విధంగా కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలో 80శాతంకు పైగా అభివృద్ధి పనులు జరిగి ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు.మిగిలిన సమస్యలపై కూడా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.ముఖ్యమంత్రి మొండితనం వలన అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.సరైన



ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని.

అవగాహన,ప్రణాళిక లేకుండా జీహెచ్ఎంసీ ని మూడు కార్పోరేషన్లగా ఏర్పాటు చేయడం వల్ల అటు అధికారులు, ఇటు ప్రజలు గందరగోళానికి గురవుతున్నట్లు తెలిపారు.జీహెచ్ఎంసీ ఒక్కటే ఉన్న సమయంలో వివిధ శాఖలలో పూర్తి స్థాయి ఉద్యోగులు,సిబ్బంది లేరని, నూతన నియామకాలు చేపట్టకుండా మూడు కార్పోరేషన్లగా విడగొట్టడంతో అధికారులపై పనిభారం పడటమే కాకుండా సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో అమీర్‌పేట సర్కిల్ డీసీ సుజాత,టౌన్ ప్లానింగ్ అధికారి రాజేశ్వరి,వాటర్‌వర్క్స్ డీజీఎం అశీష్,డీఈ మహేష్,హార్టికల్చర్ అధికారి సైదులు,మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి,నాయకులు శ్రీహరి,నరేందర్,శేఖర్,శ్రీనివాస్‌గౌడ్,కిషోర్,ఆకుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అశోక్‌నగర్ చౌరస్తాలో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కాంగ్రెస్ ఆందోళన

**చిక్కడపల్లి మే 23 ( ప్రభాతవార్త ) :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్ (బాబ్జి) ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్ నుండి అశోక్ నగర్ చౌరస్తా వరకు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. బింగి సాయి కీర్త్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం దేశంలో విద్యా వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వరుస లీకేజీలు, అవకతవకలపై ప్రధాని నరేంద్ర మోదీ మోనం వీడాలని, తక్షణ మే పరీక్షా లీక్స్ పే చర్చ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పేపర్ పదే పదే లీక్ అవుతున్నప్పటికీ, బీజేపీ ప్రభుత్వం దీనిని కనీసం పట్టించుకోవడం లేదు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోనే ఇవి ఎందుకు జరుగుతున్నాయి? దీనిని బట్టి చూస్తే దాల్ మే కుచ్ కాలా హై అని స్పష్టమవుతోంది" అని దుయ్యబట్టారు. బీజేపీ హయాంలో విద్యా




నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ పై గాంధీనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

మాఫియా కు పూర్తి స్వేచ్ఛ లభించిందని, అందుకే దేశంలో గత ఏడేళ్లలో సుమారు 70కి పైగా వివిధ పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని ఖర్గే ఆరోపించారు. ఈ లీకేజీల కారణంగా దేశవ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మారిశెట్టి నరసింగ రావు, అభిషేక్ కెన్నెడీ , గుర్రం శంకర్ , నరేందర్ యాదవ్, సురేందర్, బాబురావు, వెంకటేష్, రాజేష్ తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## సంవత్సరాలుగా పారుతున్న డ్రైనేజీ నీరు..

**-పట్టించుకోని అధికారులు,ప్రజాప్రతినిధులు**

**అత్తాపూర్ మే23 ,ప్రభాతవార్త :** కాటేదాన్ నుండి గగన్‌పహాడ్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్డు మార్గంలో నిత్యం డ్రైనేజీ నీరు పారుతూ నయగరజలపాతాన్ని తలపిస్తుంది.గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన డ్రైనేజీ లీకేజ్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరవైయ్యాడు.నిత్యం ఈ రోడ్డు గుండ ప్రయాణం సాగించాలంటే ముక్కుమూసుకొని ప్రయాణం చేయాల్సి వస్తుంది.నిత్యం స్థానిక ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ ప్రయాణం సాగిస్తుంటారని అయిన కొన్ని సంవత్సరాల నుండి ఈ సమస్యకు పరిష్కరం చూపడం లేదని స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.శనివారం డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి మాట్లాడుతూ... గగన్‌పహాడ్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్ అండర్‌పాస్ వద్ద గత 16 సంవత్సరాలుగా తీవ్రమైన డ్రైనేజ్ లీకేజ్ సమస్య కొనసాగుతోందని 2009లో ఈ అండర్‌పాస్ ప్రారంభమైనప్పటి నుండి ఈ సమస్య అలాగే ఉండిపోయినా, ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. డ్రైనేజ్ మురుగు



నీరు జప్రధాన రహదారిపై పడుతూ ఉండటంతో తీవ్ర దుర్వాసన, దోమల పెరుగుదల, ప్రజల ఆరోగ్య సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు మరియు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోయారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి నీటి నిల్వలు, జారిపడే ప్రమాదాలు, వాహనదారులకు ఇబ్బందులు, స్కూల్ పిల్లలు మరియు స్థానిక ప్రజలకు తీవ్ర కష్టాలు ఎదురవుతున్నాయని ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జిహెచ్ఎంసి ,హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాడ్ చేశారు.

## ఘనంగా వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

**మూసాపేట, మే 23, ప్రభాతవార్త**

వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో హైదర్‌నగర్ డివిజన్ సమతా నగర్‌లో ఉన్న ఎస్ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్‌తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, నిర్వాహకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వికారాబాద్ జిల్లా నుంచి రికార్డు స్థాయిలో క్రీడాకారులు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, సభ్యులు సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్, పీవీఎల్ కుమార్, ఏ.వి.




బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

రమణా రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. అలాగే అకాడమీ నిర్వాహకులు, చీఫ్ కోచ్ జయంత్, ఎం. రామ రాజు, సాయితేజలను అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించడంలో వీరి పాత్ర కీలకమని కొనియాడారు.వారి సమిష్టి కృషి ఫలితంగానే ఈ ఏడాది ఏకంగా 530 మంది క్రీడాకారులు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం గర్వకారణ మని పేర్కొన్నారు. ఈ స్థాయిలో పాల్గొనడం వికారాబాద్ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు.

## కాంగ్రెస్ బాగ్ లింగంపల్లి అధ్యక్షుడిగా నవీన్ నాయక్

**చిక్కడపల్లి మే 23 ( ప్రభాతవార్త ) :** కాంగ్రెస్ పార్టీ బాగ్ లింగంపల్లి డివిజన్ కమిటి నూతన అధ్యక్షుడుగా నవీన్ నాయక్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్ కుమార్ యాదవ్ శనివారం నవీన్ నాయక్ కు



నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ అనీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలనీ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేయాలని, అదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. నవీన్ నాయక్ మాట్లాడుతూ కార్యకర్తలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించడం ద్వారా కాంగ్రెస్ పతిష్టత కోసం కృషి చేస్తానని చెప్పారు. డివిజన్ కమిటి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దీపక్ జాన్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ లకు నవీన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి స్థాయి డివిజన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో పని చేస్తామని చెప్పారు.

## వేం నరేందర్‌రెడ్డిని కలిసిన వడ్డెర సంఘం నేతలు



వేంనరేందర్‌రెడ్డితో మైసయ్య, శేఖర్, లోకేష్ తదితరులు

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ మాజీ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ ఔ అధ్యక్షులు దండుగుల మైసయ్య , జాతీయ కార్యదర్శి మక్కల శేఖర్ , జాతీయ యువజన అధ్యక్షులు డా. లోకేష్ వేముల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సిఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా వడ్డెర కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, కార్పొరేషన్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయాలని వడ్డెర సమాజానికి ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలను పెంచడం హర్షణీయం

**-ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి**

**హైదరాబాద్, మే 23 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అన్నారు. రాష్ట్రంలో గత 12 సంవత్సరాలుగా వేతన సవరణ జరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శనివారం అంబర్‌పేట్, డిడి కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా అరకొర వేతనాలతో కార్మికులు తెలంగాణ రాష్ట్రంలో పనిచేయలేక ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కొరతతో ఇప్పటికే చాలా కంపెనీలు మూతపడ్డాయని, ఉన్న కొద్ది కంపెనీల ఉత్పత్తి కూడా తగ్గిపోయిందన్నారు. ఈ పరిణామాలు దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. కార్మికుల గొంతుకగా నిలిచే ట్రేడ్ యూనియన్లను రద్దు చేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను, వారి హక్కులను కాలరాసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సిఎం కెసిఆర్ తన నియంతృత్వ పోకడలతో కార్మిక వ్యతిరేక పరిపాలన కొనసాగించారని విమర్శించారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తానే ముఖ్యమంత్రితో స్వయంగా సంప్రదింపులు జరిపి వేతన సవరణ చేసే విధంగా కృషి చేశానని తెలిపారు. చట్టపరంగా ప్రతి రెండు మూడేళ్లకు ఒకసారి వేతన సవరణ చేసి, కార్మి




ఐఎన్‌టియుసి సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, చిత్రంలో మొగుళ్ళ రాజిరెడ్డి, ఆర్.డి.చంద్రశేఖర్ తదితరులు

కుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని సంజీవరెడ్డి కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ వేతన సవరణ కార్మికులకు నేరుగా చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, మధ్యలో కమీషన్లు దండుకుంటున్న దళారీ వ్యవస్థను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ వేతన సవరణతో 1.10 కోట్ల మందికి లాభం చేకూరుతుందని తెలిపారు. మున్సిపల్, జల మండలి, ఔట్ ఉద్యోగులకు కూడా వేతన సవరణ చేపట్టాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్ అమలు చేసి కార్మికుల హక్కులను కాలరాస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వేతన సవరణ చేపట్టి కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌యాదవ్ రాష్ట్ర కోశాధికారి జగన్ మోహన్ రెడ్డి తదితరులు పాలొని మాట్లాడారు.

## సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి : మన్నె గోవర్ధన్ రెడ్డి

**జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్తః**

ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి కోరారు. బంజారాహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో డిజిటల్ పద్ధతిలో ఈ ఏడాది సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సభ్యత్వ నమోదు అంశాన్ని పర్యవేక్షించడం కోసం ఇన్చార్జిలను నియమించారన్నారు. ఈ విషయంలో ఎవరూ గందరగోళానికి గురికావొద్దని సూచించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ఇంచార్జిగా ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌ను నియమించారన్నారు. అన్ని డివిజన్‌లకు సంబంధించిన సీనియర్ నేతలు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.

గతంతో పోలిస్తే నియోజకవర్గంలో బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగిందని దానికి అనుగుణంగా సభ్యత్వ నమోదు చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సభ్యత్వ నమోదు ఇంచార్జ్ శ్రవణ్‌తో కలిసి విధివిధానాలు ఖరారు చేసి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రామచందర్, జలాల్, కత్తాల్, హైమద్, శంకర్, నాగరాజ్, ధనరాజ్, శశిరాజ్ పాల్గొన్నారు.

## దేవి దేవాలయంలో అఖండ తాళసప్తాహం

**- నిరంతరాయంగా తాళం ..భక్తిపారవశ్యంలో భక్తజనం**



మెడలో తుంబురా వేసుకొని తాళాలు మోగిస్తూ భజన చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ దంపతులు

**చాంద్రాయణగుట్ట, మే 23, ప్రభాతవార్త :** అధిక జేష్ట (పురుషోత్తమ) మాసాన్ని పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయ ఆవరణలోని శ్రీ పంచాయతన బాల విశ్వేశ్వర స్వామి ప్రాంగణంలో పాండురంగ విఠలేశ్వర్ అఖండ 34వ తాళసప్తాహ మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైయ్యింది. గ్రామ పురోహితులు గోళ్ళ నరహరి శర్మ, ఎ.విజయ్ కుమార్ల ఆధ్వర్యంలో గణపతి పూజ, కంకణ బంధనం, అఖండ దీపారాధన, నవగ్రహారాధన, తాళమృదంగాది పూజ, భాగవత పూజ, పాండురంగ విఠలేశ్వరుని పూజ, పంచాయతన బాల విశ్వేశ్వరుని రుద్రాభిషేకం, భాగవత పారాయణం, కుంకుమార్చన, అన్న పూజలు చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాలలో సమీప బస్తీల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఆ తరువాత అఖండ తాళ భజన ప్రారంభమైయ్యింది. కేశవగిరి కుమ్మరి భక్త సమాజం, లక్ష్మమ్మ భక్త సమాజం, కేశవగిరి మహిళ భక్త భజన మండలి, గౌడ సంఘం మహిళా మండలి, కేశవగిరి మహిళా భక్త సమాజం, కుమ్మరి సంఘం మహిళా మండలి, కేశవగిరి చిటికెల భజన, శ్రీ కనకదుర్గ భక్త సమాజం, సంత్ ఏక్‌నాథ్ భజన మండలి, కేశవగిరి శివశక్తి భక్త సమాజం, శివకేశవ భక్త సమాజం, గంగాధర భక్త సమాజంలచే భజన కార్యక్రమాలు జరిగాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ అఖండ తాళ సప్తాహం ఈనెల 30వ తేదీ శనివారం వరకు జరుగుతుంది.

## ఉచిత నీటిని ఇవ్వాలని జలమండలి ఎండికి వినతి



జల మండలి ఎండికి వినతిపత్రం ఇస్తున్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధుల దృశ్యం.

**నార్సింగి, మే 23 ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపిన కొత్త వార్డులకు రోజుకు 20.వేల లీటర్ల ఉచిత మంచి నీటిని సరఫరా చేయాలని కోరుతూ బండ్లగూడ, హైదర్షాకోట్, కిస్మత్‌పూర్ డివిజన్లలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధుల బృందం శనివారం జల మండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రంను అందజేసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షులు వినయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రిజర్వాయర్లలోకి నీటిని సరఫరా చేయకపోవడంతో అవి పడావు పడ్డాయన్నారు. వీటిలోకి జల మండలి అధికారులు నీటిని నింపి సరఫరా చేస్తే వేసవిలో ప్రజల నీటి ఇబ్బందులు దూరం అవుతాయన్నారు. బండ్లగూడ, హైదర్షాకోట్, కిస్మత్‌పూర్ డివిజన్ల పరిధిలో నీటి సరఫరా సరిగ్గా జరుగడం లేదని, ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్లల్లోని బోర్లు ఎండిపోయి,వాడుకునే నీటికి సైతం ప్రజలు అల్లాడిపోతున్నారని, వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారని, జల మండలి నీరు ఐదు రోజులకు ఒకసారి మాత్రమే వస్తున్నాయని ఎండి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మేము అందజేసిన వినతిపత్రంను జల మండలి ఎండి అశోక్‌రెడ్డి చదివి సానుకూలంగా స్పందించారని వివరించారు. ఈ విషయంను సీఎంఒ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారని, వినియోగంలో లేని రిజర్వాయర్లను తనిఖీ చేసి వినియోగంలోకి తీసుకు వస్తామని ఎండి హామీనిచ్చారని ఫెడరేషన్ ప్రతినిధుల బృందం వివరించింది. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నదీమ్, కార్యవర్గ సభ్యులు విజయ్, పద్మనాభన్, రవిరాజా తదితరులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో హిట్ అండ్ రన్

**- ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు**

**జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్తః**

బంజారాహిల్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల సందర్భంగా ఓ ఆటో డ్రైవర్ హిట్ అండ్ రన్ చేసి పారిపోయాడు. ఈ సంఘటనలో ట్రాఫిక్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడటంతో అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని టీజీ స్టడీ సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి దాటిన తరువాత 12.05 గంటల ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అటుగా వచ్చిన ఒక ఆటో డ్రైవర్ వేగంగా వస్తుండటాన్ని గమనించి అక్కడే తనిఖీలు నిర్వహిస్తున్న 2010 బ్యాచ్‌కు చెందిన పోలీసు కానిస్టేబుల్ బి. శంకర్ ఆటోను నిలువరించేందుకు ప్రయత్నించాడు. ఆటో డ్రైవర్ అంతే వేగంగా ఆటోను నిలుపకుండా కానిస్టేబుల్‌ను బలంగా ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయలవ్వడంతోపాటు అతని కాలు విరిగిపోయింది. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు ఒకవైపు ఆటోను పట్టుకొనేందుకు ప్రయత్నించగా మరికొందరు గాయపడిన కానిస్టేబుల్‌ను హుటాహుటిన యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. గాయపడిన కానిస్టేబుల్ ఆరోగ్యపరిస్థితి ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. ఈ సంఘటనపై ట్రాఫిక్ పోలీసులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రీన్ కలర్ ఆటోగా గుర్తించి స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్‌లో పబ్‌లో అర్ధరాత్రి గొడవ...కేసు నమోదు

**జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఓ పబ్‌లో జరిగిన చిన్న గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రోహిత్ కుమార్ జైన్ తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫోర్జ్ క్లబ్ పబ్‌లో మ్యాచ్ వీక్షించేందుకు వెళ్లాడు. అక్కడ సంగీతం, డ్యాన్స్ కార్యక్రమాల మధ్య వారి గ్రూప్‌లోని మహిళలు డ్యాన్స్ చేస్తుండగా, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. దీనిపై మహిళల్లో ఒకరి భర్త ప్రశ్నించగా, రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వివాదం క్రమంగా ఘర్షణకు దారితీసి పరస్పరం తోపులాటకు దిగారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు క్లబ్ బౌన్సర్లు జోక్యం చేసుకున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తుల్లో ఒకరు గాజు వస్తువును ఫిర్యాదుదారుల గ్రూప్‌పైకి విసిరారు. అది కాస్త నికిత అనే మహిళకు తగలడంతో ఆమెకు రక్తస్రావ గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టిఫిన్ సెంటర్‌లో చట్నీ వివాదం.. యజమానిపై కత్తితో దాడి

**పేట్ బషీరాబాద్, మే 23, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్‌లోని జై భవాని టిఫిన్ సెంటర్ ఎదురుగా ఉన్న కేపీఎన్ ఫ్రెష్ టిఫిన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పేట్ బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం, రమేశ్వర్ శివాజీ సఖారే అనే వ్యక్తి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అక్కడ గత నాలుగు సంవత్సరాలుగా పార్థమేష్ అనే యువకుడు పని చేస్తున్నాడు.శుక్రవారం ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో ఓ కస్టమర్ టిఫిన్ సెంటర్‌కు వచ్చి ఎక్స్‌ట్రా చట్నీ విషయమై పార్థమేష్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో కస్టమర్ పార్థమేష్‌పై చేయి చేసుకున్నట్లు సమాచారం. వెంటనే టిఫిన్ సెంటర్ యజమాని ఇద్దరికీ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.అయితే ఆ వ్యక్తి ఆగ్రహంతో అక్కడే ఉన్న ఉల్లిపాయలు, కూరగాయలు కోసే కత్తిని తీసుకుని పార్థమేష్‌పై దాడికి ప్రయత్నించాడు. మధ్యలో యజమాని అడ్డుకోవడంతో అతనిపై కూడా కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.దాడి చేసిన వ్యక్తిని గోషామహల్‌కు చెందిన హరీష్‌గా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే శ్రీగణేష్


లాల్ బజార్‌లో మార్కెట్,ట్రాఫిక్ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:** 7వ వార్డు లాల్ బజార్‌లో మార్కెట్‌లో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. బుధవారం లాల్ బజార్‌లోని వివిధ ప్రాంతాల్లో, పోలీస్,వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ ప్రాంతాల్లో ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పెరిగిన ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజును ఆదేశించారు.కార్యక్రమంలో 7వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు నాగి నేని సరిత,మురళీ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## మన్నె క్రిశాంక్‌తో కంటోన్మెంట్ మాజీ బోర్డు మెంబర్లు బేటీ


కంటోన్మెంట్ మాజీ బోర్డు మెంబర్లతో బేటీఅయినా మన్నె క్రిశాంక్

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిగా మన్నెక్రిశాంక్ నియమితులైన సందర్భంగా శనివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు సభ్యులు పాండు యాదవ్, పి.శ్యామ్ కుమార్, లోకనాధం, అనితాన‌ప్రభాకర్,నళిని కిరణ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు.

**ఎమ్మెల్యే తలసానికి అభినందనలు తెలిపిన మన్నెక్రిశాంక్**

కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిగా నియమితులైన మన్నెక్రిశాంక్ మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శనివారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యేక్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

## డిజిపి సివి ఆనంద్‌కు సన్మానం



**కార్వాన్,మే23(ప్రభాతవార్త)**

తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చడంలో కీలకపాత్ర పోషించినందుకుగాను తెలంగాణ పోలీస్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డీజీపీ సి.వి.ఆనంద్ ను భాజపా యువనాయకుడు, సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షులు దేవర వంశీ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినంధనలు తెలిపారు.మావోయిస్టుల ఏరివేతలో వారు చూపిన తెగువను దేవర వంశీ ప్రత్యేకంగా కొనియాడారు.

## సెంట్రింగ్ కార్మికులకు మద్దతు ప్రకటించిన జనసేన


సెంట్రింగ్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 23, ప్రభాతవార్త**

హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద గత రెండు రోజులుగా నిరాహార దీక్ష నిర్వహిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కార్మికులు గుత్తేదారుల అసోసియేషన్ సభ్యులు మద్దతు కోరగా కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ కార్మికులను పరామర్శించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వారి న్యాయపరమైన డిమాండ్లకు శనివారం పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ సెంట్రింగ్ కార్మికులు ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న 31 రూపాయల రేటును 51 రూపాయలకు పెంచాలని, కార్మికుల కుటుంబాల భద్రత దృష్ట్యా 10 లక్షల నుండి 20 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం పెంచాలని, అలాగే కార్మిక సంక్షేమానికి అవసరమైన ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శ్రమజీవుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని, అలాంటి కార్మికుల సంక్షేమం కోసం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కాకుమాను లక్ష్మణ్ రావు, కొల్లా శంకర్, బోగాది వెంకటేశ్వరావు, వేముల మహేష్, పోలెబోయిన శ్రీనివాస్, మాధవ్ రావు, బడే విశ్వేశ్వర్ రావు, చిట్టి బాబు జనసైనికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

**కూకట్‌పల్లి, మే 23, ప్రభాతవార్త**

ఈనెల 25న ఎన్.కె.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరాలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎండలు తీవ్రత కారణంగా ఉదయం 9 గంటలకే కేటీఆర్ వస్తున్నారని నాయకులు, కార్యకర్తలు కూడా దీన్ని గమనించి త్వరగా సమావేశ ప్రాంగణానికి రావాలని అన్నారు. ఎక్కడా కార్యకర్తలకు, నాయకులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు, మంచినీరు, మజ్జిగ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వస్తారని అన్నారు.

## కూకట్‌పల్లి ఎవిబిపురం భూదాన్ బాధితులకు ఎంపి ఈటల భరోసా

**కెపిహెచ్‌బి కాలనీ, మే 23, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి ఏవిబిపురంలోని భూదాన్ భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బాధిత కుటుంబాలు చేపట్టిన ధర్నాకు ఎంపీ ఈటల రాజేందర్ మద్దతు తెలుపుతూ భరోసా ఇచ్చారు. ఆచార్య వినోబా భావే భూదాన్ ఉద్యమంలో భాగంగా నిలువ నీడలేని నిరుపేదలకు ఒక్కో కుటుంబానికి 60 చదరపు గజాల చొప్పున సుమారు 850 కుటుంబాలకు స్థలాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. దశాబ్దాలుగా చిన్న చిన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న పేదలకు ప్రభుత్వం ఇబ్బందులు కలిగించకుండా, వారికి పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడి భూదాన్ బోర్డు భూమికి, ఐడిపిఎల్ పరిశ్రమకు సంబంధించి ఉన్న స్థల వివాదాన్ని పరిశ్రమల మంత్రి కుమార స్వామితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడి పేద ప్రజల స్థలం విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని అలాగే జిల్లా కలెక్టర్ ద్వారా సంపూర్ణ సమాచారం తీసుకుని అర్హులైన పట్టాదారులకు స్థలాలు అందేలా చూస్తానని చెప్పారు. ఇప్పటికే ఇక్కడి పట్టాదారులు కోట్ల చుట్టు తిరిగి, అలసిపోయి నానా అవస్థలు పడుతున్న బీద ప్రజల ఇబ్బందులను సాధ్యమైన తొందర్లో పరిష్కార మార్గం చూపుతానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. భూదాన్ భూముల సమస్యను మానవీయ దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట మాజీ కార్పొరేటర్ మహేందర్, రాష్ట్ర నాయకులు ఎంజాల పద్మయ్య, జి శ్రీకర రావు, భూదాన్ బోర్డుకు చెందిన పలువురు పట్టాదారులు తదితరులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

## హమీద్ బస్తీలో డ్రైనేజ్ దుర్వాసన..అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**జీడిమెట్ల, మే 23, ప్రభాతవార్త**

130 సుభాస్‌నగర్ డివిజన్ పరిధిలోని హమీద్ బస్తీ మసీదు సమీపంలో గత కొంతకాలంగా డ్రైనేజ్ పొంగి పొర్లుతూ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానిక ప్రజలు, బాటసారులు, సమీప ఫ్యాక్టరీల్లో రోజు వారీ కూలి పనులు చేసుకునే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆ మార్గంలో కాలినడకన ప్రయాణించే వారికి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.డ్రైనేజ్ నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో స్థానిక కుటుంబాల్లో పిల్లలు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, దుర్వాసన, కాలుష్యం కారణంగా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.ఈ సమస్యను గమనించిన మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకలేదని తెలిపారు. జిహెచ్ఎంసి సిబ్బంది ఇది తమ పరిధిలోకి రాదని, వాటర్ వర్క్స్, ఇలా అధికారుల పరిధిలో ఉందని చెబుతుండగా, మరోవైపు సంబంధిత శాఖలు మాత్రం జిహెచ్ఎంసి బాధ్యత అంటూ తప్పించుకుంటున్నాయని ఆరోపించారు. ప్రత్యేకంగా వాటర్ వర్క్స్ ఏఈ మునీర్ నాలుగు నెలలుగా సమస్యను పరిష్కరిస్తాం అంటూ కాలయాపన చేసి, ప్రస్తుతం దీనికి తనకు సంబంధం లేదని చేతులెత్తేశారని స్థానికులు మండిపడుతున్నారు.ఒక శాఖపై మరో శాఖ బాధ్యత నెట్టేస్తూ సమస్యను పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేకపోతే స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరిస్తున్నారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని హమీద్ బస్తీ ప్రజలను రోగాల బారిన పడకుండా కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


డ్రైనేజ్ పొంగిపొర్లుతున్న దృశ్యాలు

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన జె.ఎం.ఆర్.


1వ వార్డు నూతన్ కాలనీలో ఎరులై పారుతున్న మురుగునీరు, మరమ్మత్తులు చేయిస్తున్న జెం.ఎం.ఆర్.

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 1వ వార్డు నూతన్ కాలనీ పెద్ద తోకట్ట ప్రాంతాల్లో బోర్డు ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌పై బిటీ రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో డ్రైనేజీ మురుగునీరును సాఫీగా పోయేందుకు మ్యాన్‌హోల్స్ లేకపోవడంతో డ్రైనేజీ మరమ్మత్తు చేపట్టాలంటే ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సివరేజ్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

## సమస్యల పరిష్కారం కోసం మంత్రి పొంగులేటిని కలిసిన బండి రమేష్


మంత్రి పొంగిలేటిని కలిసిన బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 23, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించి సమస్యల పరిష్కారం కోసం టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సచివాలయంలో శనివారం కలిశారు. ముందుగా మంత్రికి పూల మొక్క ఇచ్చి శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ పరిధిలోని వసంత నగర్ పరిధి (సర్వే నెంబర్లు 145, 163) ఐడిపిఎల్ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీలోని ఇళ్ల గత కొంత కాలంగా రిజిస్ట్రేషన్ చేయడం లేదని దీంతోపాటు గత సంవత్సర కాలంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్ల నిర్మాణానికి అనుమతులు సైతం అధికారులు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కారణంగా స్థానికులు గత 40 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్న ప్రస్తుతం పర్మిషన్లు ఇవ్వకపోవడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి తాను స్వయంగా అధికారులతో మాట్లాడి సమస్య ఎక్కడ ఉందో తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు బండి రమేష్ పేర్కొన్నారు.

**జెఎన్‌టియూహెచ్ క్యాంపస్‌లో ఉచిత వైద్య శిబిరం...**

**కెపిహెచ్‌బి కాలనీ, మే 23, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి జెఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో శనివారం మాధాపూర్ సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో వార్షిక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌లు ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో కెపిహెచ్‌బి లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సహా దాదాపు 90 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ వార్షిక మెడికల్ క్యాంప్‌లో బీపీ పరీక్షలు, షుగర్ పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ), నేత్ర పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు.పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు.

## ఆక్రమణలు తొలగింపు


అక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

**జీడిమెట్ల, మే 23, ప్రభాతవార్త**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ డెప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది శనివారం భారీ ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌ను చేపట్టారు. ఉషా ముళ్ళపూడి హాస్పిటల్ రోడ్డు నుండి రామ్‌కీ అపార్ట్‌మెంట్స్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అనధికారిక షాపులు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలను సిబ్బంది జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ మార్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతుండటం, కాలినడకన వెళ్లే ప్రజలు ప్రమాదాల బారిన పడుతుండటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ యు. వెంకట్రాములు మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. మరోసారి ఎవరైనా రోడ్లపైకి వస్తే సామాగ్రిని జప్తు చేయడమే కాకుండా, సదరు వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు నమోదు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. వ్యాపారులు మున్సిపల్ నిబంధనలను పాటించి, నగర రవాణా వ్యవస్థ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## మహేష్‌కుమార్‌గౌడ్‌పై అసత్య కథనాలను ఖండించిన బిసి నాయకులు


బషీరాబాగ్‌లో ఛానల్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిసి నాయకులు

**సైఫాబాద్, మే 23 ప్రభాతవార్త :** పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌పై ఒక ఛానల్ అసత్య ప్రచారాలు చేసి ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నించిందని పలు బిసి సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం బషీరాబాద్ చౌరస్తాలో ఆ ఛానల్ యాజమాన్యం దిష్టిబొమ్మను వారు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిసి నాయకులు గణేషాచారి, విజయకృష్ణ, కులకర్ల శ్రీనివాస్, తాడికొండ విక్రమగౌడ్ తదితరులు మాట్లాడుతూ, మహేష్‌కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడిందని ఆయన బిసిలతోపాటు అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ తరుణంలో ఆయన ఎదుగుదలను చూసి ఓర్చుకోలేని ఒక ఛానల్ అసత్య కథనాలు సృష్టించి ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే మహేష్‌కుమార్ గౌడ్‌కు క్షమాపణలు చెప్పాలను వారు డిమాండ్ చేశారు.


శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పొద్దుటూరి రవీందర్ ,తదితరులు

## పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలి : ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, మే 23, ప్రభాతవార్త:**

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం సనత్‌నగర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన శ్రీరామ్ మెమోరియల్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.పోలీసు అధికారి శ్రీరామ్ జ్ఞాపకార్థంగా ఈ పోటీలను నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. ముందుగా శ్రీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ క్రీడల వలన ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా దేహదారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలను ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఉంటాయని తెలిపారు.ప్రపంచంలోని అనేక దేశాలు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, మన దేశంలో క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనేక క్రీడలు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం కేవలం క్రికెట్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని విమర్శించారు.క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, కష్టపడి మంచి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్రీడా పోటీలను సాయంత్రం వేళల్లో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు రమేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, పీయూష్ గుప్తా, ఖలీల్, జమీర్, పోటీల నిర్వాహకులు షఫీ అహ్మద్, ఇమ్రాన్ ఖాన్, అబ్దుల్ జాఖీ తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

# యుపిఎస్సి పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**-జిల్లాలో 100 కేంద్రాలు ..44209 మంది అభ్యర్థులు**

**- ఇంచార్జ్ కలెక్టర్ నారాయణ రెడ్డి**

**హైదరాబాద్,మే 23,ప్రభాతవార్త:**

ఆదివారం నిర్వహించే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు.పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు ఈపరీక్షకు హైదరాబాద్ లో 100 పరీక్షా కేంద్రాలలో 44209 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించే విధంగా పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ నిబంధనలు మేరకు ఆదివారం 24న పేపర్ 1 ఉదయం 9.30 గంటల నుండి ఉదయం 11.30 గంటల వరకు,పేపర్ 2 మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. యూపీఎస్సీ నిబంధనల మేరకు పరీక్ష కు 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లు మూసి వేయడం జరుగుతుందన్నారు. ఉదయం పరీక్షకు 30 నిమిషాల ముందు అనగా ఉదయం 9.00 గంటలకు, మధ్యాహ్నం 30 నిమిషాల ముందు అనగా మధ్యాహ్నం 2.00 గంటలలోపే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆ తర్వాత వచ్చిన వారికి అనుమతించడం జరగదన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు,క్యాలిక్యులేటర్లు, సెల్ ఫోన్, పెజర్స్, బ్లూ టూత్, పెన్ డ్రైవ్స్, స్మార్ట్ వాచ్, ప్రోగ్రామ్ డివైస్, ఎలక్ట్రానిక్ గాడ్జెస్, ఎలక్ట్రానిక్ వస్తువులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద జామర్ ఏర్పాటు చేపట్టడం జరిగిందని తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సూపర్వైజర్లు పనిచేయాలన్నారు. విధులకై నియమించిన అధికారులు, ఉద్యోగులు సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద వస్తువుల భద్రత కోసం ఎలాంటి స్టాక్ రూమ్ లు ఏర్పాటు చేయడం లేదని ఇది గమనించి అభ్యర్థులు ఎవరు కూడా బ్యాగులు, ఎలక్ట్రానిక్ గూడ్స్ తో పాటు ఇతర వస్తు వులను పరీక్ష కేంద్రానికి తీసుకురావద్దని కలెక్టర్ సూచించారు . పరీక్ష కేంద్రంలోనికి పెన్, పెన్సిల్, ఐడి కార్డ్, ఇఅడ్మిట్ కార్డ్ ఫోటోగ్రఫీ మాత్రమే అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## పెరిగిన ధరలకు నిరసనగా ఆటో ర్యాలీ


ఆటోకు తాడు కట్టి లాక్కెలుతున్న ఐఏటీయూసి నేతలు

**జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్త:** పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా ఏఐటియుసి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని క్యాన్సర్ ఆసుపత్రి నుండి జహీరానగర్ కూడలికి ఆటో కార్మికులు శనివారం నిరసన ర్యాలీ తీశారు. పెరిగిన ధరలను నిరసిస్తూ ఆటోకు తాళ్లు కట్టి లాక్కొని వెళుతూ ఈ ర్యాలీని కొనసాగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతన్న ధరలను వెంటనే నియంత్రించాలని, ధరలను తగ్గించి సామాన్యులను ఇబ్బందులను తొలగించాలని కోరారు. ధరల పెరుగుదులతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్యాస్ కోసం దాదాపు 8, 9 గంటలు వేచి ఉండాల్సిన పరిస్తితి ఏర్పడుతుందన్నారు. దీనికితోడు ఒక్కో పంపులో ఒక్కో ధరతో గ్యాస్ నింపుతున్నారన్నారు. దీంతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిక్షపతి యాదవ్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి జంగయ్య, సంయుక్త కార్యదర్శి అబ్దుల్ గని, దాసరి భాస్కర్, ఖాజా, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా, ముని భాయ్ హుస్సేన్, సోమప్ప, ఖాళిభాయ్ తదితరులు పాల్గొన్నారు.

## మన ఓటు-మన రాజ్యం నినాదంతో దేశవ్యాప్త పాదయాత్ర



మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

**సైఫాబాద్, మే 23 ప్రభాతవార్త :** మన ఓటు మన రాజ్యం అనే నినాదంతో జూన్ 15 నుంచి దేశ వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తున్నామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ఈ మేరకు శనివారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళిత బహుజనులకు రాజ్యాధికారమే సాధన లక్ష్యంగా మన ఓటు మన రాజ్యం అనే నినాదంతో ఈ పాదయాత్ర చేపడుతున్నామని చెప్పారు. ఈ పాదయాత్ర వచ్చే ఏడాది అక్టోబర్ 14వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా జరుగుతుందన్నారు. దేశంలో దళిత బహుజన ప్రజలకు, దోపిడీ కులాల పాలనలో ఆర్థిక సామాజిక, రాజకీయ జీవనరంగాల్లో తీవ్రంగా అన్యాయం జరుగుతుందని, దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాదయాత్ర ద్వారా దళితుల్లో చైతన్యం తీసుకొస్తామని ఆయన చెప్పారు.

## ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, బండి నారాయణ స్వామికి సన్మానం


ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, బండి నారాయణస్వామిని సన్మానిస్తున్న బి.వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ, కవి, గాయకుడు గోరేటి వెంకన్నతో పాటు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణ స్వామికి నిజాంపేటలో సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర మీడి యా సెల్ అధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో గోరేటి వెంకన్న తన పాట, ఆటతో ప్రజల్ని ఉత్తేజపరచి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్‌తో పాటు టియుడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు వర్దెల్లి వెంకటే శ్వర్లు, సీనియర్ జర్నలిస్ట్ నాగేంద్ర చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి. వెంకటే శ్వర్లు ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న సమక్షంలో పాడిన ఆ చల్లని సముద్ర గర్భం గేయాన్ని పాడగా ఆయన్ని గోరేటి వెంకన్న అభినందించారు.

### క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణాలో గ్రామీణ సంత ప్రారంభం

**జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్త:** బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో రెండో గ్రామీణ సంతను గ్రామ భారతి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. గ్రామ భారతి వ్యవస్థాపకులు ఆకుతోట రామారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో గ్రామ భారతి ద్వారా ప్రకృతి సేద్యంలో శిక్షణ పొందిన రైతులు పండించిన రసాయన రహిత పంటలు, మిల్లెట్స్,చేతి వృత్తులు, కులవృత్తులు వారు తయారు చేసిన వస్తువులను విక్రయించుకోవడానికి గ్రామీణ సంతను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ భారతి ఉపాధ్యక్షులు ఊట్కూరి లింగం, గ్రామ భారత సలహాదా రులు పలుస కరుణాకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు శ్రీ. శివకుమార్, బాలస్వామి, యూత్ ఫర్ సేవా వాలంటీర్స్ పాల్గొన్నారు.

## బస్తీల్లోనే పింఛన్‌దారుల లైవ్ వెరిఫికేషన్ : అసదుల్లాఖాన్


పెన్షన్ దారుల లైవ్ వెరిఫికేషన్ చేస్తున్న తహశీల్దార్ అసదుల్లాఖాన్

**కంటోన్మెంట్,మే 23 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న అసరా పింఛన్ దారులు లైవ్ వెరిఫికేషన్ కోసం తహశీల్ కార్యాలయం వరకు రావాల్సిన అవసరం లేదని తమ జీపిఓలు,అర్.ఐలు మీ ఇండ్ల వద్దకే వచ్చి వెరిఫికేషన్ చేస్తారని మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వేసవి కాలాన్ని, మండు టెండలను దృష్టిలో ఉంచుకొని, వయసు మీదపడిన వృద్ధులు, వికలాంగుల ఆరోగ్య స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజు నాయక్, ఆర్ఐ.మోహన్, జీపి.ఆర్.ఓలు దండి రాజు, శ్రావన్ గౌడ్,నరేశ్ పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

General Public is hereby informed that My client Smt.V.Saraswathi W/o. V.Ranga Reddy, aged about 65 years, Occ: House wife, resident of Parvathapur village, Bommalaramaram Mandal, Nalgonda District, my clientlost the OriginalDocument i.e Sale Deed vide Doc.No. 10960 of 1991 Dated : 28.10.1991 in respect of the property i.e Land baring Plot No.48, in Sy.Nos.32 and 33 admeasuring 200 Sq.yards or 167.23 Sq.Mtrs, situated at Kuntloor village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District.

My clientlost the document the above Sale Deed vide Doc.No. 10960 of 1991 Dated : 28.10.1991 due to my client shifted to house at Hayathnagar. My client lodged a complaint at Hayathnagar. If anybody is found or stolen. The said document may be returned to my client under signed immediately. It is warned that if any person misused. My client take action through court of law.

**Narsimha Dudala**
Advocate
# Sunrise Colony,
Kuntloor
Abdullapurmet,
R.R.District.
**Ph : 9848626900 & 8555904743**



తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
మూసాపేట సర్కిల్-53, కూకట్‌పల్లి జోన్

క్ర.సం.1. వివరణ: సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కొరకు ఫ్లైఓవర్ క్రింద బాలానగర్ జంక్షన్ వద్ద అన్ని విధాలా పూర్తి అయిన మరియు లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా, క్రేన్ నెలకొల్పుట, స్థాపన, టెస్టింగ్, కమిషనింగ్ కలిపి క్రింద పేర్కొనబడిన శిల్పాల యొక్క డిజైన్, సరఫరా, ఫ్యాబ్రికేషన్, రవాణా, అందవేత మరియు స్థాపన కొరకు సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. 3డి అర్బన్ ల్యాండ్ మార్క్ శిల్పాలు, స్టెయిన్‌లెస్ స్టీల్/SS 316 సింబాలిక్ మానవ రూపాలు కలిపి, మరియు వృక్షసంపద మూలవస్తువులు, వంపులు తిరిగిన స్టెయిన్‌లెస్ స్టీల్ వాస్తు సంబంధిత ప్యానెల్స్, వంపులు తిరిగిన వాస్తు ప్యానెల్స్, సర్క్యులర్ సెంట్రల్ ట్రాఫిక్ నిబంధన ప్రదర్శించే స్ట్రక్చర్, సమీకృత ట్రాఫిక్ అవగాహన సైనుచిహ్నాలు, మార్గం తెలిపే బోర్డులు, రిఫ్లెక్టివ్ ట్రాఫిక్ సింబల్స్, బ్రష్ ఫినిష్‌తో స్టెయిన్‌లెస్ స్టీల్ క్లాడింగ్, మైల్డ్ స్టీల్ అంతర్గత స్ట్రక్చరల్ ఫ్రేమ్ వర్క్, యాంకర్ బోల్ట్స్, గ్రానైట్ క్లాడ్ పెడెస్టల్‌తో RCC ఫౌండేషన్, ప్రకాశవంతమైన అక్షరాలతో, LED ఆర్కిటెక్చరల్ లైటింగ్, థీమ్స్, ట్రాఫిక్ నిబంధనలు. విషయాలు : తెలంగాణ రైజింగ్, కలిసి పెరుగుదాం, కలిసినడుద్దాం, పాదచారుల భద్రత & ట్రాఫిక్ చైతన్యం, కలిసి అభివృద్ధి సాధిస్తున్న సైబరాబాద్. పరిమాణం : 5. యూనిట్ : పని. తేదీ: 28.05.2026న లేదా ముందు సా.05.00గం. వరకు సీల్డ్ కొటేషన్లు దాఖలు చేయవలెను. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మూసాపేట సర్కిల్-53, కూకట్‌పల్లి జోన్, CMC. i) కోట్ చేసిన రేట్స్‌కు వర్తించే విధంగా GST ఆదనంగా ఉంటుంది. ii) లెటర్ ప్యాడ్‌పై GST నం. పేర్కొనటం తప్పనిసరి. iii) సవివర శిల్పాల ప్రత్యేక సందేశ విషయంలో వివరాలను ఈ కార్యాలయం నుండి పొందవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మూసాపేట సర్కిల్ - 53, కూకట్‌పల్లి జోన్, CMC.

DIPR.NO. 2924-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 23.05.2026

## రూ.8.90 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తుర్కయంజాల్, మే 23 ( ప్రభాతవార్త )
ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్,తొర్రూర్ డివిజన్లో, హెచ్ఎండిఏ నిధుల కింద ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజల్ డివిజన్ పరిధిలో వివిధ వార్డులలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఇబ్రహీం పట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ, మొత్తం రూ.8.90 కోట్ల వ్యయంతో 14 వార్డులో అభివృద్ధి పనులను మంజూరు చేసి అమలు చేశామని తెలియజేశారు.మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో వర్షాకాలంలో బురద, రాకపోకల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ఉపశమనం లభించిందని ముఖ్యంగా అంతర్గత రహదారుల అభివృద్ధితో కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని తెలియజేశారు. ఈ పనులన్నీ పూర్తికావడంతో మున్సిపాలిటీ పరిధిలో రహదారి సదుపాయాలు మెరుగుపడి ప్రజలకు రాకపోకలు సులభతరమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా హెచ్ఎండిఏ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం లో డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, డి ఈ బిక్షపతి, చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఓ శ్రీనివాస్, విద్యుత్ డి ఈ, ఏ ఈ,తుర్కయంజాల్, తొర్రూర్, డివిజన్ల అధ్యక్షులు కోసిక ఐలయ్య, ఒర్సు శ్రీనివాస్, సీనియర్ నాయకులు ధనరాజ్ గౌడ్, సామ భీమారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, కాకుమాను సునీల్, నారని శేఖర్ గౌడ్, విజయనంద్ రెడ్డి, మేతరి అనురాధ దర్శన్, వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, రేవల్లి యాదగిరి, కొంతం వెంకట్ రెడ్డి, రాజు నాయక్, గుడ్ల అర్జున్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే బలాల



జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్ పేట, మే 23, ప్రభాతవార్త:
పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అభివృద్ధి పనుల గురించి జిహెచ్ఎంసి అధికారులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ ఓల్డ్ మలక్ పేటలో కొనసాగుతున్న బాక్స్ డ్రైయిన్ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యాతా ప్రమాణాలను పాటించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇఇ మాధవి, సూపర్వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

మల్కాజిగిరి మే 23, ప్రభాతవార్త:
మల్కాజిగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.మిర్జాల్‌గూడ డివిజన్ పరిధిలోని వాణీ నగర్ వీధి నెంబరు 2 లో 54 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తో కలిసి మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు,జెఏసి వెంకన్న మేకల రాము యాదవ్,బైరు అనిల్,కిట్టు ,నర్సింగ్ రావు,భిక్షపతి,రెబ్బా వాసు,శ్రీరామ్ యాదవ్,సీతా శెంకర్ యాదవ్,అజీజ్,భాగ్యవతి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కార్మికుల శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలి



మల్కాజిగిరి మే 23, ప్రభాతవార్త:
మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మౌలాలి లోని హిందూస్తాన్ కోకా కోల బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపారు. కార్మికులకు వారి పనికి తగిన వేతనాలు అందించాలని, కనీస వేతనాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.హైదరాబాద్ వంటి మహానగరం లో సామాన్య ప్రజలు జీవించడం రోజురోజుకీ భారంగా మారుతోందని, పిల్లల చదువులు, ఇళ్ల అద్దెలు, నిత్యావసర ఖర్చులు, జీవనోపాధికి అవసరమైన వ్యయాలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందువల్ల కార్మికులకు కనీస వేతనాలు కల్పించి, వారు ఆత్మగౌరవంతో జీవించేలా చూడాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు.అలాగే ఉద్యోగుల నైపుణ్యాలను గుర్తించి స్కిల్ బేస్డ్ శాలరీలు అమలు చేయాలని కూడా ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యంతో జరిగిన చర్చలకు స్పందించిన ప్రతినిధులు త్వరలో సంస్థ ఉన్నత యాజమాన్యంతో సమావేశమై ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్ఆర్ మేనేజర్ శంకర్ బాబు, మేనేజర్ జీవీకే చౌదరి, లేబర్ కాంట్రాక్ట్ సూపర్వైజర్ షేక్ నూర్ ఉల్ హాక్, కంపెనీ కార్మికులు దామోదర్ రావు, రమేష్, హుస్సేన్ అహ్మద్, మురళి, గణేష్, ఆనంద్, సుదర్శన్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు భాగ్యనంద్ రావు, హేమంత్ పటేల్, వంశీ ముదిరాజ్, సాయి గౌడ్ పాల్గొన్నారు.

## డిజిపిని సత్కరించిన మాస్ నాయకులు



సివి.ఆనంద్‌ను సన్మానిస్తున్న బ్రహ్మయ్య తదితరులు

ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు స్వీకరించిన సివి.ఆనంద్‌ను మన ఆలోచన సాధన సమితి(మాస్) రాష్ట్ర ప్రచారకార్యదర్శి పెదవుర బ్రహ్మయ్యశాలువాతో సన్మానించారు. శనివారం ఆయన కార్యాలయంలో కలుసుకున్న మాస్ నాయకులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి పరిరక్షణలో బిజెపి సేవలు అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోలీస్‌శాఖను మరింత బలోపేతం చేయాలని , ప్రజలకు న్యాయం చేసే విధంగా ఆయన సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐత రాజుశంకర్, పగడాల ఉమాపతి, దూదిగామ వీరన్న పాల్గొన్నారు.

## బసరాజు సురేష్ ఆధ్వర్యంలో బిజెపిలోకి భారీగా చేరికలు



తుర్కయంజాల్, మే 23,ప్రభాతవార్త : ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్ డివిజన్ మన్నెగూడలోని జెఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం రాజకీయ ఉత్సాహంతో కళకళలాడింది. స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బసరాజు సురేష్ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధికి చెందిన యువకులు, వివిధ కాలనీలకు చెందిన కార్యకర్తలు భారీ సంఖ్యలో బిజెపిలో చేరారు.ఈ చేరికల కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ, తెలంగాణలో బీజేపీ వేగంగా ప్రజల్లోకి వెళ్తోందని, ముఖ్యంగా యువత పార్టీ సిద్ధాంతాలపై ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ కీలక శక్తిగా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, దేశ ప్రయోజనాల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రతి వర్గానికీ చేరుతున్నాయని తెలిపారు.పిలుపునిచ్చారు.మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, తుర్కయంజాల్ ప్రాంతంలో బీజేపీ బలపడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువత రాజకీయ చైతన్యంతో ముందుకు రావడం ప్రజాస్వామ్యానికి మంచిదని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి పనిచేస్తుందని హామీ ఇచ్చారు.స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బసరాజు సురేష్ మాట్లాడుతూ, యువతలో జాతీయ భావజాలం పెరుగుతోందని, అదే వారిని బీజేపీ వైపు తీసుకువస్తోందన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరైన యువకులు ఇప్పుడు రాజకీయ సేవలో భాగస్వాములు కావడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో అభివృద్ధి, పారదర్శక పాలన కోసం బీజేపీకి ప్రజలు మద్దతు ఇస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసు పల్లి ప్రతాప్, జిల్లా అధ్యక్షులు రాజభూపాల్ గౌడ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ నోముల దయానంద్ గౌడ్, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి, బచ్చి గళ్ల రమేష్, తుళ్ళ నరసింహ గౌడ్, అర్జున్ రెడ్డి, కొత్త రామ్ రెడ్డి, కందాల బల్దేవ్ రెడ్డి, కరాడి శ్రీలత అనిల్ కుమార్, గుండా కృష్ణ, నోముల కార్తీక్ గౌడ్, సురేష్ గౌడ్ విశాల్ గౌడ్, నిట్టు శివ,దార వెంకటేష్, కుంభం శివ, తదితర నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## బాలుడికి శస్త్రచికిత్స చేసి కొత్త జీవితాన్ని అందించిన వైద్యులు

మలక్ పేట, మే 23, ప్రభాతవార్త:
అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి మలక్ పేట కేర్ హాస్పిటల్స్ వైద్యులు శస్త్ర చికిత్స చేసి కొత్త జీవితాన్ని అందించారు. హయత్‌నగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడు శివ దుర్గా రెడ్డి దాదాపు ఐదు నెలల పాటు తీవ్రమైన వాంతులు, బలహీనత, ఆహారం తీసుకోలేకపోవడం, మలబద్ధకం వంటి సమస్యలతో తీవ్రంగా బాధపడ్డాడు. కుటుంబ సభ్యులు అనేక ఆస్పత్రులు తిరిగి, పలు పరీక్షలు చేయించినా అసలు సమస్య ఏమిటో వైద్యులు గుర్తించలేకపోయారు.రోజురోజుకీ బాలుడి ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబం ఆందోళనకు గురైంది. చివరికి కాలనీలోని పరిచయాల ద్వారా కుటుంబ సభ్యులు మలక్‌పేట్‌లోని కేర్ హాస్పిటల్స్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, రోబోటిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్‌ను సంప్రదించారు.బాలుడి లక్షణాలను పూర్తిగా పరిశీలించిన డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్ ఇది సాధారణ గ్యాస్ట్రిక్ సమస్య కాదని,"సుపీరియర్ మెసెంటరిక్ ఆర్టరీ సిండ్రోమ్" అనే అరుదైన వ్యాధి కావచ్చని అనుమానించారు. మనం తిన్న ఆహారం చిన్న ప్రేగుల ద్వారా ముందుకు సాగుతుందని, కానీ ఎస్ఎంఏ సిండ్రోమ్ లో చిన్న ప్రేగులోని ఒక భాగం రెండు ప్రధాన రక్తనాళాల మధ్య ఇరుక్కుపోతుందని, దీనివల్ల ఆహారం సరిగా వెళ్లకపోవడంతో తరచుగా వాంతులు, పొట్ట నొప్పి, బలహీనత, బరువు తగ్గడం, జీర్ణ సమస్యలు వస్తాయని డాక్టర్ భూపతి రాజేంద్రప్రసాద్ వివరించారు. నిర్ధారణ కోసం సీఈసీటీ అబ్డొమెన్ స్కాన్" చేయించగా, మొదటి రిపోర్టులో అన్నీ సాధారణంగానే ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే అనుమానం తొలగకపోవడంతో డాక్టర్ భూపతి రాజేంద్రప్రసాద్ స్వయంగా స్కాన్ ఫిల్మ్‌ను పరిశీలించి, రేడియాలజిస్టులతో చర్చించారు. అనంతరం మళ్లీ పరిశీలించగా ఎస్ఎంఏ సిండ్రోమ్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. తర్వాత బాలుడికి లాపరోస్కోపిక్ డ్యూడెనోజెజునోస్టమీ" అనే



బాలుడితో కలిసి వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్

అత్యాధునిక మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలో ఇరుక్కుపోయిన చిన్న ప్రేగు భాగాన్ని దాటేలా కొత్త మార్గం ఏర్పాటు చేయడంతో ఆపరేషన్ విజయవంతమై, బాలుడు కేవలం మూడు రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యాడని వివరించారు.ఈ సందర్భంగా డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ,ఇది కేవలం ఒక వ్యాధి చికిత్స మాత్రమే కాదనీ , సాధారణ గ్యాస్ట్రిక్ సమస్యల లాగా కనిపించే అరుదైన వ్యాధిని గుర్తించడం చాలా ముఖ్యమని, దీర్ఘకాలంగా తగ్గని లక్షణాలు ఉన్నప్పుడు వైద్యులు సాధారణ నిర్ధారణలకే పరిమితం కాకుండా లోతుగా పరిశీలించాలని అన్నారు. మలక్ పేట కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్లా మాట్లాడుతూ, క్లిష్టమైన వైద్య సమస్యల్లో నిపుణుల అనుభవం, పట్టుదల, సమన్వయంతో కూడిన వైద్య సేవలు ఎంత ముఖ్యమో ఈ కేసు నిరుపించిందని, సరైన సమయంలో సరైన నిర్ధారణ రోగి జీవితాన్ని పూర్తిగా మార్చగలదని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా వాంతులు, పొట్ట నొప్పి, ఆకస్మిక బరువు తగ్గడం వంటి సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నరని తెలిపారు.

## మల్కాజ్‌గిరిలో సైబర్ ముఠాల ఆటకట్టు..ఏడుగురు అరెస్ట్

నేరెడ్ మెట్,మల్కాజ్‌గిరి కమిషనరేట్ , మే 23 (ప్రభాతవార్త ):
సైబర్ నేరగాళ్లకు మల్కాజ్‌గిరి కమిషనరేట్ పోలీసులు చెక్ పెట్టారు. పెట్టుబడుల పేరుతో, డిజిటల్ అరెస్ట్‌లతో, నకిలీ ట్రేడింగ్ యాప్‌లతో ప్రజలను మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర సైబర్ ముఠాలపై ఉక్కుపాదం మోపిన సైబర్ క్రైమ్ పోలీసులు.. కేవలం వారం రోజుల్లోనే ఐదు ప్రధాన కేసులను ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మే 17 నుంచి 23 వరకు సాగిన ప్రత్యేక దర్యాప్తులో ఈ విజయాలు సాధించినట్లు పోలీసులు వెల్లడించారు.దర్యాప్తులో భాగంగా దేశవ్యాప్తంగా కార్యకలాపాలు సాగిస్తున్న సైబర్ ముఠాలకు బ్యాంకు ఖాతాలను అందిస్తున్న మ్యూల్ అకౌంట్ హోల్డర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఇదే సమయంలో బాధితుల నుంచి మోసపూరితంగా దోచుకున్న మొత్తాల్లో భాగంగా రూ.23, 30,066ను రికవరీ చేసి కోర్టు ఆదేశాలతో బాధితుల ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు తెలిపారు.డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.1.66 కోట్లు కాజేసూర్యాపేట జిల్లా పరిసరాల్లో పండితి క్రాంతికుమార్, వోర్సు నాగరాజు అనే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు అంతర్జాతీయ సైబర్ ముఠాలకు బ్యాంకు ఖాతాలు సమకూర్చినట్లు తేలింది. ఫిబ్రవరిలో కొందరు నిందితులు సీబీఐ, ఉన్నత పోలీసు అధికారులమంటూ వీడియో కాల్ చేసి బాధితుడిని బెదిరించారు. మానవ అక్రమ రవాణా, మనీలాండరింగ్ కేసుల్లో ఇరికిస్తామని, సుప్రీంకోర్టు పేరిట నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయిందని నకిలీ పత్రాలు చూపించి భయాందోళనకు గురిచేశారు. కేసు నుంచి బయటపడాలంటే వెరిఫికేషన్ అవసరమంటూ విడతల వారీగా రూ.1.66 కోట్లు కాజేశారు.ఖాతాదారుడికి తెలియకుండానే డబ్బుల మాయంనిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అంబర్ శ్రీనివాస్, వాగుమరి శంభు వెంకటేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారుడికి తెలియకుండా సాంకేతిక లోపాలను ఉపయోగించుకుని భారీ మొత్తంలో నగదు డెబిట్ చేసి నిందితుల ఖాతాల ద్వారా ఇతరులకు బదిలీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.షేర్ మార్కెట్ మాయతో రూ.1.16 కోట్లు స్వాహాహైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన కొమర నారాయణస్వామిని ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో అరెస్ట్ చేశారు. హయత్



నగర్‌కు చెందిన బాధితుడికి నకిలీ వెబ్‌సైట్ ద్వారా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. రోజూ నకిలీ లాభాల స్క్రీన్‌షాట్లు పంపిస్తూ విశ్వాసం కల్పించి రూ.1.16 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టించుకుని మోసం చేశారు.గోల్డ్ ట్రేడింగ్ పేరుతో వంచకరీంనగర్‌కు చెందిన మదుప రమేష్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. లండన్‌కు చెందిన సంస్థ ప్రతినిధులమంటూ బాధితుడిని సంప్రదించి గోల్డ్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టించారు. మహిళా ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా నటించిన మరో నిందితురాలు లాభాల పేరుతో డబ్బులు వసూలు చేసింది. అనంతరం విత్‌డ్రా చేసుకోవాలంటే సర్వీస్ ట్యాక్స్, ప్లాట్‌ఫాం ఫీజులంటూ మరింత డిమాండ్ చేయడంతో బాధితుడు మోసపోయిన విషయం బయటపడింది. టెలిగ్రామ్‌లో బిట్‌కాయిన్ ట్రాప్ఇదే కేసులో కొమర నారాయణ స్వామి మరో సైబర్ మోసంలోనూ కీలక పాత్ర పోషించినట్లు తేలింది. టెలిగ్రామ్ ద్వారా బిట్‌కాయిన్ ట్రేడర్‌గా పరిచయమైన నిందితులు నకిలీ స్క్రీన్‌షాట్లతో నమ్మించి యూపీఐ, క్యూఆర్ కోడ్‌ల ద్వారా భారీ మొత్తంలో నగదు బదిలీ చేయించుకుని పరారయ్యారు.అప్రమత్తంగా ఉండాలి: సైబర్ పోలీసులుపార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, ట్రేడింగ్ యాప్‌ల పేరుతో మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. అసాధారణ లాభాల హామీలు ఇచ్చే వెబ్‌సైట్లు, అపరిచిత లింకులు, యాప్‌లను నమ్మ వద్దని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, ఆధార్, పాన్ వంటి సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని తెలిపా రు. చట్ట అమలు సంస్థల పేరుతో బెదిరింపులు వచ్చినా భ యపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అల్మాస్‌గూడ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో సామ నర్సింహాగౌడ్ పూజలు

సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని అల్మాస్‌గూడలోనున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానాన్ని బడంగ్‌పేట్ నగర పంచాయతీ/మున్సిపాలిటీ ప్రప్రథమ చైర్మన్ (ప్రస్తుత మాజీ చైర్మన్), తెలంగాణ రాష్ట్ర మేయర్స్ అండ్ మున్సిపల్ చైర్మన్స్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు సామ నర్సింహాగౌడ్ సందర్శించారు. దేవస్థానం చైర్మన్ బోయపల్లి రాఘవేంద ర్‌రెడ్డి ఆహ్వానం మేరకు శనివారం ఆలయానికి విచ్చేసిన ఆయన ఆంజనేయ స్వామికి భక్తిప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి రూ.2.25 లక్షల విలువ జేసే వెండి హనుమద్భూషణం (తోక అలంకారం) త్వరలో అందజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా నర్సింహాగౌడ్ మాట్లాడుతూ బడంగ్‌పేట్ నగర పంచాయతీ/మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత తొలి చైర్మన్‌గా ఎన్నికైన తాను ఈ ప్రాంతానికి రుణపడి ఉంటానని వెల్లడించారు. గ్రామ పంచాయతీలుగా ఉండి మున్సిపాలిటీగా మారిన గ్రామాల్లో మొట్ట మొదటి చైర్మన్‌గా తన చేతుల మీదుగా అభివృద్ధి కార్యక్రమాలకు ఆనాడు శ్రీకారం చుట్టడం సంతృప్తినిచ్చిందని ఆయన వెల్లడించారు. బడంగ్‌పేట్



ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న నర్సింహాగౌడ్

మున్సిపాలిటీ నేడు శరవేగంగా అభివృద్ధి చెందినా అందులో తొలి నాళ్ళలో తన పాత్ర ఉందని ఆయన గుర్తు చేశారు. బడంగ్‌పేట్ మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలు జిహెచ్ఎంసిలో విలీనమై హైదరాబాద్ కిందకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక చింతన ఉన్న తాను ఇప్పటికే చాలా గుళ్ళు, గోపురాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేసి విరాళాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. కాగా అల్మాస్‌గూడ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన గౌడ్‌ను దేవస్థానం చైర్మన్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## గడ్డిఅన్నారంలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్, మే 22 ప్రభాతవార్త: గడ్డి అన్నారంలోని శ్రీభక్తఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి వైద్యులు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలు, మందులు అందజేశారు. ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ఎం. శ్రీనివాస్ ఒంటినొప్పులు ఉన్నవారికి ఎక్సర్ సైజ్ లు చేసే విధానం గురించి చూపించారు. భారత్ వికాస్ పరిషత్ ద్వారా మహిళలకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలను అందజేశారు. ఈ శిబిరంలో భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సుధాకర్ శర్మ, కమిటి సభ్యులు లింగాల హరి గౌడ్, వేణుగోపాల్, సుధీర్ గౌడ్, న్యాయవాది పి. శ్రీనాథ్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి, శ్రీధర్, కృష్ణ మనోహర్, పోచమ్మ బస్తీ అధ్యక్షుడు బి.విజయ్, రాఘవేంద్ర, ధర్మేంద్ర, జైపాల్ రెడ్డి, సతీష్, నరేష్, జనహిత క్యాంపు కోఆర్డినేటర్లు బి. నర్సింగ్ రావు, జే.విక్రమ్ పాల్గొన్నారు.

## జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించండి



సైదాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మొగుళ్ల రాజిరెడ్డి

సైదాబాద్, మే 23 ప్రభాతవార్త :
గత రెండేళ్లలో ప్రభుత్వం, జలమండలి యాజమాన్యంతో చర్చించి అనేక ఉద్యోగ కార్మిక సమస్యలను పరిష్కరించిన ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ త్రిశూలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి కోరారు. సైదాబాద్ హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ డివిజనల్ కార్యాలయం లో జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం ప్రచారం నిర్వహించి, కార్మికులను కలసి యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. జూన్ 6 న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఉద్యోగులను మొగుళ్ళ రాజిరెడ్డి కోరారు. అనంతరం మీరాలం, దారుల్ షిఫా, మొఘల్‌పురా, బాల్‌చెట్టి ఖేత్ జలమండలి సెక్షన్ ల పరిధిలో వివిధ సంఘాలకు చెందిన పలువురు కార్మికులు తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ లో చేరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవన్ కుమార్, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అక్తర్ అలీ, నాయకులు పి.చంద్రశేఖర్, కె.ఆనంద్ రెడ్డి, మజారుద్దీన్, రెహమాన్, సి.రాజు, ఇందూరి తిరుపతి, వినోద్ గౌడ్, ఏఐటీయూసీ నాయకులూ నరసింహ, ఎస్.కె. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

నేరెడ్ మెట్ , మే 23,ప్రభాతవార్త :
వేసవి ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బలరాంనగర్ డివిజన్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు డివిజన్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్ ముదిరాజ్ తెలిపారు. శనివారం ఓల్డ్ పీస్ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు టీ. వెంకటేష్ యాదవ్, బి బ్లాక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.కే. శ్రీనివాస్ హాజరై ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మోర శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవడం కాంగ్రెస్ పార్టీ విధానమని పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు చల్లదనం కలిగించేం దుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



శ్రీనివాస్‌కు చెక్కు అందజేస్తున్న మధురఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మే 23 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన కళ్యాణలక్ష్మీ చెక్కును ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీకి చెందిన లబ్ధిదారులు మాలే శ్రీనివాస్ గుప్తాకు శనివారం చిలుక మధురఉపేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా కొంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆటంకాలు కలగకుండా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే అనేక ప్రజా ప్రయోజనకరమైన పనులను చేపట్టిందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తూ హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు, విప్లవ్ పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎల్.బి.నగర్ యూత్ కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి నివాసం లో కలిసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కళ్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇవ్వాలి : ఎమ్మెల్యే



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మే 23 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు ప్రయోజనాలు కల్పించాలని సూచించారు. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో ఉప్పల్ మండలానికి చెందిన 233 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలని, సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా రూ.లక్ష నూట పదహారుతోపాటు తులం బంగారం కూడా ఇవ్వాలని అన్నారు. ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నదని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముభారక్ ప్రయోజనాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఆర్ఐ ఎం.అశ్విని గౌడ్, జూనియర్ అసిస్టెంట్ ఎం,అనంత రాములు, పి.వెంకన్న, ఎం,అలివేలు, ఆపరేటర్ సునీత, అటెండర్స్ సత్య నారాయణ,విఆర్ఏ స్వామి,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.64లక్షలతో శేషసాయినగర్‌లో అభివృద్ధి పనులు



శేషసాయినగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మే 23 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్ శేషసాయి నగర్‌లో రూ.64 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం మాజీ కార్పొరేటర్ మందముల రజితరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. శేషసాయినగర్, మల్లికార్జున్ నగర్ కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కొత్త డ్రైనేజీ నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఇక ఉండదని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కాగానే త్వరలోనే రూ.64 లక్షలతో సీసీ రోడ్ల పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. దశలవారిగా అన్ని కాలనీలలో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో శేషసాయినగర్ కాలనీ అధ్యక్షుడు అచ్చన శ్రీనివాస్, నర్సయ్య, రాకేష్ నాయక్, మోహన్ రెడ్డి, వెంకటేశ్వర రావు, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పవన్ కుమార్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, పూజారి హనుమంతు, వేణుగోపాల్ రెడ్డి, విప్లవ రెడ్డి, హనుమంతు, చారి, నవీన్, వంక మాధవ, శ్రావణి, వంశీ, మౌనిక, అనుష, భాస్కర్, టి. దేవేందర్ పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంఛార్జిగా వాణిదేవి

సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తెలంగాణ ప్రభుత్వంలో మొట్టమొదటి మహిళా మంత్రిగా పని చేసిన పి.సబితా ఇంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గంలో జరిగే బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుకు సంబంధించి ఇంఛార్జిగా



సబితా ఇంద్రారెడ్డితో వాణిదేవి

ఎమ్మెల్సీ సురభి వాణిదేవి నియమితులయ్యారు. బిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ అధినేత కెసిఆర్ తెలంగాణలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు సభ్యత్వ నమోదు ఇంఛార్జులను ప్రకటించారు. ఇందులో కీలకమైన మహేశ్వరం నియోజకవర్గానికి మాజీ ప్రధాని స్వర్గీయ పివి నర్సింహారావు కూతురైన ఎమ్మెల్సీ సురభి వాణిదేవి సభ్యత్వ నమోదు ఇంఛార్జిగా నియమితులయ్యారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి చిగిరింత దంపతుల సన్మానం



సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు కలిసి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి నగరంలోని మంత్రుల నివాస సముదాయానికి తరలి వెళ్ళిన మాజీ మేయర్ దంపతులు అక్కడ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు తూళ్ళ నరహరిగౌడ్ పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ పోచమ్మకుంట వద్ద విద్యుత్ దీపాలు ప్రారంభం

సరూర్‌నగర్, మే 23 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో అభివృద్ధి, సుందరీకరణ జరుగుతున్న అల్మాస్‌గూడ పోచమ్మకుంట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని పలు చెరువుల అభివృద్ధి, సుందరీకరణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించిన సబితా ఇంద్రారెడ్డి ఇక్కడి పోచమ్మ కుంట వద్ద లైటింగ్ సిస్టమ్‌ను స్విచాన్ చేసి ప్రారంభించారు.

## ఉప్పల్ డివిజన్ సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ఉప్పల్, మే 23 ప్రభాతవార్త : ఉప్పల్ డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితోపాటు, బిఆర్ఎస్ సీనియర్ నేతలు బింగి భరత్‌గౌడ్, పంగ మహేందర్‌రెడ్డి తదితరులు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్‌లోని పలు కాలనీలో డ్రైనేజీ, మురుగునీటి సమస్యలు ఉన్నాయని, కొత్త పనులకు టెండర్లు పిలిచి అమోదం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.